క్లుప్తంగా

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం



పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారుడికి అందజేస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ధర్మవరం రూరల్: గ్రామ స్వరాజ్య స్థాపనకు అహర్నిశలు కృషి చేస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటక్రిష్టారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని గొట్లూరులో స్థానిక నాయకులతో కలిసి గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై లబ్ధిదారులతో ఆరా తీశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గురించి ప్రజలతో అడిగి అక్కడే వున్న అధికారులతో వాటిని పరిష్కరించడానికి చర్యలు చేపట్టారు.

గురుపౌర్ణమి వేడుకలకు విరాళం



డాక్టర్ బత్తల హరిప్రసాద్‌ను సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

కదిరి టౌన్: పట్టణంలోని కోనేరు సమీపంలో ఉన్న షిర్డి సాయిబాబా ఆలయంలో జూలైలో జరిగే గురుపౌర్ణమి వేడుకలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ సోమవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన డాక్టర్ బత్తల హరిప్రసాద్, డాక్టర్ బత్తల వెంకటరమణను ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కుమారస్వామి, ట్రస్ట్ సెక్రటరీ కొమ్ము భాస్కర్, పద్మావతి, రమణమ్మ, బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

నల్లచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఓరువాయి, నల్లచెరువు సచివాలయాల పరిధిలో నూతనంగా నియమితులైన వలంటీర్లకు ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీఓ శకుంతల నియామక పత్రాలు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, డైరెక్టర్ ఆదిమూర్తి పాల్గొన్నారు.

పవర్‌లూమ్స్‌పై రాజకీయం చేయొద్దు



మాట్లాడుతున్న ధర్మవరం పవర్‌లూమ్స్ అసోసియేషన్ నాయకులు

ధర్మవరం: పవర్‌లూమ్స్ మగ్గాలకు ఎమ్మెల్యే వత్తాసు పలుకుతున్నారని చెప్పడం సరికాదని ధర్మవరం పవర్‌లూమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలా వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి గిర్రాజు రవి తెలిపారు. స్థానిక పవర్‌లూమ్స్ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ధర్మవరంలో కేవలం 3వేలకు పైగా మాత్రమే చేనేత మగ్గాలున్నాయని తెలిపారు. ప్రస్తుతం కాలానికి అనుగుణంగా పవర్‌లూమ్స్‌లోకి చేనేత కార్మికులు మారుతున్నారన్నారు. చేనేత సంఘం నాయకులు అనవసరంగా ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు, ప్రస్తుతం నారా లోకేష్ పాదయాత్రలో పవర్‌లూమ్స్ మగ్గాలకు 200 యూనిట్ల సబ్సిడీ ఇస్తామని చెప్పింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పవర్‌లూమ్స్ మగ్గాలకు ఏ రాజకీయ నాయకుడు సహకరించలేదని తెలిపారు. చేనేత నాయకులు అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. త్వరలో పవర్‌లూమ్స్ కార్మికులతో పట్టణంలో భారీ ర్యాలీ చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో పవర్‌లూమ్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి



సమావేశమైన పూర్వ విద్యార్థులు

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లలో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం 1990–91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన గురువులు నీకలంత, రామచంద్ర, పాపయ్య, బాబును పూలమాలతో సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయంగా రూ.2 లక్షలతో షెడ్డు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



కదిరి టౌన్: జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



ప్రశాంతి నిలయం: చిత్రావతి బైపాస్ రోడ్డులో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి



బత్తలపల్లి: దంపెట్లలో మొక్కలు నాటుతున్న ఆర్డీటీ ఆర్డీ ప్రమీల, తదితరులు

కదిరి టౌన్: ప్రపంచ పర్యావరణాన్ని పరిరక్షించుదాం అని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీలో పర్యావరణాన్ని రక్షించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. పేపర్ బ్యాగులు, బట్ట బ్యాగులు వాడేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పరికి సాదిక్‌బాషా పాల్గొన్నారు.

ఓడీ చెరువు: మండలంలోని దాదిరెడ్డిపల్లి సమీపంలోని అక్కదేవత గుడి వద్ద గ్రీన్ భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సుకుమార్ గుప్తా, ఆదినారాయణ, శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయం: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి పిలుపునిచ్చారు. పట్టణంలోని చిత్రావతి బైపాస్ రోడ్డులో మున్సిపల్ సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. అలాగే ప్రశాంతి నిలయం వద్ద మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌రాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మీదేవమ్మ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ నటరాజ్, నాయకులు బిల్డర్ మల్లికార్జున, శంకర్ పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: ఎనుములపల్లి గణేస్ సర్కిల్ వద్ద హ్యాపీ హోం ట్రస్ట్ సభ్యులతో కలిసి రోడ్డు వెంబడి, హ్యాపీ హోం పరిసరాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా, మేనేజింగ్ కమిటీ సభ్యులు రంజిత, సాయిదర్శిని, కో–ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

బత్తలపల్లి: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్డీటీ ఆధ్వర్యంలో మండలంలోని ఈదుల ముష్టూరు, మాల్యవంతం, కోడేకండ్ల, దంపెట్ల, పత్యాపురం తదితర గ్రామాల్లో మొక్కలు నాటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి తేజశ్రీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీటి రీజనల్ డైరెక్టర్ ప్రమీల, దంపెట్ల సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు, ఏటీఎల్ రుక్మాంగద పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: మండలంంలోని దర్శనమల పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి ఆసుపత్రి ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పుష్పలత, సీహెచ్‌ఓ కళావతి, ఎంపీహెచ్‌ఈఓ శివయ్య పాల్గొన్నారు.

ముదిగుబ్బ: స్థానిక పీహెచ్‌సీ, మలకవేమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ బి.నాగేంద్ర నాయక్, డాక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు వేణుగోపాల్‌రెడ్డి, రవీంద్ర పార్మసిస్టు వినయ్, లాబ్ టెక్నీషియన్ బాషా, స్టాఫ్ నర్సు శైలజ, రాజేష్, గంగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీ డిపో మేనేజర్ మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వెంకటేషులు, శ్రీరాములు, హెడ్ క్లర్క్ ప్రేమ్‌కుమార్, అకౌంటెంట్ ఓబులేసు, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, నాయకులు నరసింహులు, హరినాథ్ పాల్గొన్నారు. కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో కళాశాలలో మొక్కలు నాటారు.

పుట్టపర్తి టౌన్: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో మేనేజర్ ఇనయతుల్లా ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటి, నీరు పోశారు. ఆర్టీసీ, గ్యారేజ్ సిబ్బంది, అన్ని యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

నల్లమాడ: పెమనకుంటపల్లి తండా, కుటాలపల్లి తండా, మూలప్పగారిపల్లి, కొండకింద తండా, వేళ్లమద్ది గ్రామాల్లో ఆర్డీటీ ఆధ్వర్యంలో 130 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీటీ కదిరి రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, ఏటీఎల్ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ ఆనంద్‌నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఎన్పీకుంట: మండలంలోని 250 మెగావాట్ ఎన్‌టీపీసీ సోలార్‌ప్లాంట్‌లో జాక్సన్ గ్రీన్ రెన్యువబుల్ సర్వీసెస్ ప్రై.లి. ఆధ్వర్యంలో 250 మొక్కలు నాటారు. ఎన్‌టీపీసీ డీజీఎం రామ్మోహన్, జేజీఆర్‌ఎస్‌పీఎల్ సైట్ మేనేజర్ ప్రకాష్‌రెడ్డి, ప్లాంట్ ఇన్‌చార్జ్‌లు మధుకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీపీ అంజలి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా నాయకులు, అధికారులు కలిసి మొక్కలు నాటారు. ఎంపీడీఓ గంగావతి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో ఉన్న స్పేస్ కళాశాలలో కదిరి ఆటవీక్షేత్రాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అలాగే స్థానిక ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉప అటవీ క్షేత్రాధికారి రామచంద్రనాయక్, సెక్షన్ ఆఫీసర్లు షామీర్ బాషా, రామచంద్రారెడ్డి, బీట్ ఆఫీసర్లు, రోటరీ క్లబ్ కదిరి అధ్యక్షుడు కిషోర్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలను పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించి ప్రభుత్వంపై నమ్మకం కలిగించాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లో కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదుదారుల నుంచి 42 అర్జీలను స్వీకరించారు. ఇందులో ముదిగుబ్బకు చెందిన పలువురు నితిన్‌సాయి కన్స్‌ట్రక్షన్స్ చేస్తున్న నేషనల్ హైవే 42 పనులు త్వరగా పూర్తికాక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదు చేశారు. కంకర తోలి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు పూర్తి చేయించాలని కోరారు.

10 అర్జీల స్వీకరణ..

బత్తలపల్లి: స్పందన కార్యక్రమంలో అందే అర్జీలపై దృష్టి సారించి వాటిని వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పది అర్జీలు అందినట్లు తెలిపారు. భూ సమస్యలపై 8, ఇంటి స్థలం కోసం ఒకటి, హద్దుల కొరకు కొలతలు వేయాలని ఒక అర్జీ అందినట్లు తెలిపారు. ఎంపీడీఓ శ్రీదేవి, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఏఓ ఓబిరెడ్డి, మండల ఇంజినీర్ రమణయ్య, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, హౌసింగ్ ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన



ప్రశాంతి నిలయం: బ్రాహ్మణపల్లిలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



కదిరి టౌన్: ప్రభుత్వ పాలనపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి



ధర్మవరం: ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పీవీ సిద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రశాంతి నిలయం: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 15, 16 వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ పథకాలను వివరించారు. ,వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగు సంవత్సరాల పాలన పండుగలా సాగిందన్నారు. అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, రైతులు, యువతకు మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుతం పని చేస్తోందన్నారు. రాష్ట్రంలో రాబందుల్లా ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నాయన్నారు. ప్రజలు గమనించి మరోమారు జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలన్నారు. 2014లో 600 అబద్ధపు హామీలతో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. 2024లో ఆల్ ఫ్రీ అంటూ మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలు తగిన గుణపాఠం నేర్పి ఇంటికి పంపాలన్నారు. పుట్టపర్తి అభివృద్ధి చెందాలంటే ఇక్కడ తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోని రావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ సూర్యాగౌడ్, వైస్ చైర్మన్ తిప్పన్న, టౌన్ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు పవన్‌కుమార్, చెరువు భాస్కర్‌రెడ్డి, నాయకులు పార్థసారధి రెడ్డి, లింగాల భాస్కర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, బాబుల్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సైపుద్దీన్, చంద్రశేఖర్‌రెడ్డి, సాయిరాం రెడ్డి, సుధీర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, గంగాద్రి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మొద్దు..

కదిరి టౌన్: ఒక వైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆంధ్రప్రదేశ్‌ను సీఎం జగన్ దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని షహమీరియా స్ట్రీట్ వార్డు సచివాలయం పరిధిలోని 24వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వార్డులో సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు. సిమెంట్ రోడ్డు, డ్రైన్ వేసేందుకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న వారికి ఇంటి పట్టాలు అందజేస్తామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసిన చంద్రబాబు ఓర్వలేక పోతున్నారన్నారు. లేనిపోని ఆరోపణలతో బురద జల్లే కార్యక్రమం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎస్‌ఎండీ ఇస్మాయిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, వైస్ చైర్మన్ గంగాదేవి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

ధర్మవరం: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి నవరత్నాల్లోని పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 9వ వార్డు చిన్నూరు కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ఇంటింటికీ తిరుగుతూ పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సీసీ రోడ్లు, డ్రైన్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు సమస్యలను వివరించారు. వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని.. తొలుత డ్రైన్‌లు నిర్మించి ఆ తర్వాత సీసీ రోడ్లు వేయిస్తామని ఎమ్మెల్యే బదులిచ్చారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి.. కొత్త వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో ప్రజలంతా ఏకతాటిపై నిలిచి వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్రగుట భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ పెణుజూరు నాగరాజు, మున్సిపల్ డీఈ వన్నూర్‌స్వామి వార్డు కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్‌లతో పాటు 40 వార్డుల కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీల ఏర్పాటు


కిష్టమ్మ


గంగాద్రి


తిప్పారెడ్డి


మోహన్‌నాయక్


చంద్రశేఖర్‌రెడ్డి


మస్తాన్


రామమోహన్

పుట్టపర్తి: పార్టీ బలోపేతం కోసం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నియోకవర్గ వ్యాప్తంగా ఆయా మండలాలకు వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాలకు కమిటీలను ఏర్పాటు చేశారు. సోమవారం పుట్టపర్తి రూరల్ మండలానికి సంబంధించి కమిటీల జాబితాను పార్టీ కార్యాలయం విడుదల చేసింది. మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా సుబ్బరాయనిపల్లికి చెందిన చెందిన కిష్టమ్మ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా వెంకటగారిపల్లికి చెందిన గంగాద్రి, రైతు సంఘం మండల అధ్యక్షుడిగా చెర్లోపల్లికి చెందిన తిప్పారెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా పెడపల్లి తండాకు చెందిన మోహన్‌నాయక్, యువజన విభాగం మండల అధ్యక్షుడిగా మార్లపల్లికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడిగా నిడిమామిడికి చెందిన మస్తాన్, బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా రామమోహన్‌ను నియమించారు. వీరితో పాటు ప్రతి కమిటీలోనూ ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు మొత్తం 18 నుంచి 25 మంది ఉంటారన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నూతన కమిటీల సభ్యులు పేర్కొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోండి

రామగిరి: వైఎస్సార్‌సీపీ నేత మా కుటుంబంపై దౌర్జన్యం చేస్తున్నాడు.. అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయించి, వేధిస్తున్నాడని చేస్తున్న ఆరోపణల్లో వాస్తవంలేదని పోలేపల్లి టీడీపీ నాయకులపై సర్పంచ్ ఓబిరెడ్డి, జయచంద్రారెడ్డి, ఆదిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీరాములు, బోయచంద్ర, పాల అంజి తదితరులు మండిపడ్డారు. సోమవారం పచ్చపత్రికల్లో, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జయచందా్రరెడ్డి తమ కుటుంబాన్ని వేధిస్తున్నాడని టీడీపీ నాయకుడు రాజన్న సహకారంతో పాపిరెడ్డిపల్లికి చెందిన నవకాంత్ పచ్చపత్రికల్లో రాయించి, ప్రచారం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. నవకాంత్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైతే తన ప్రమేయం లేకున్నా ఆరోపణలు చేయించడం సరికాదని జయచంద్రారెడ్డి అన్నారు. రాజన్న సహకారంతోనే ఇలా కుట్ర చేస్తున్నారని అన్నారు. కొన్నేళ్లుగా అధికారం కోల్పోవడంతోపాటు గ్రామాల్లో టీడీపీ పట్టుకోల్పోతుందనే ఉద్దేశంతో ప్రజలను రెచ్చగొట్టేందుకు ఇలా చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ప్రజలు సొంత పనులు చేసుకుంటూ, ప్రశాంత జీవనం సాగిస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. తమపై అభియోగాలుంటే గ్రామదేవత అయిన పోలేరమ్మ ఆలయం వద్ద ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అసత్య ప్రచారాలు మాని గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలని వారు హితవు పలికారు.

అతిసారంపై అప్రమత్తత అవసరం

ధర్మవరం రూరల్: అతిసార వ్యాధి నిర్మూలనకు వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్ సూచించారు. సోమవారం దర్శనమల పీహెచ్‌సీలో అతిసార నియంత్రణ పక్షోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటి డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. 5 సంవత్సరాల్లోపు వయసు గల చిన్నారుల ఇళ్లకు వెళ్లి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. తల్లులకు ఐడీసీఎఫ్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. డయేరియా వచ్చిన పిల్లలకు 14 రోజుల పాటు తప్పనిసరిగా జింక్ మాత్రలను అందించాలన్నారు.

బత్తలపల్లి: అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా ఇంటింటికీ వెళ్లి అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారిణి తేజశ్రీ వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ రాజశేఖర్, పర్యవేక్షకులు వేమారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని నాగులబావి వీధికి చెందిన నాగభూషణ కుటుంబ కలహాలతో సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగభూషణ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ కలహాలతో కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న క్యాంటిన్ ముందు ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు అతడ్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అలంపూర్‌లో మరొకరు..

కదిరి అర్బన్: ఆలంపూర్‌లో సోమవారం శివశంకర్ అనే వ్యక్తి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించి స్థానికులు చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఆర్థికపరమైన సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికుల సమచారం బట్టి తెలుస్తోంది. రూరల్ పోలీసులు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి విరాళం

అమడగూరు: మండలంలోని మహమ్మదాబాద్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మాతృశ్రీ వృద్ధాశ్రమానికి కదిరి శ్రీసాయి ఆగ్రోస్ లిమిటెడ్ సంస్థ యజమాని ప్రతాప్‌రెడ్డి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. సోమవారం ఆయన అమడగూరు సమీపంలోని వృద్ధాశ్రమానికి వెళ్లి నిర్వాహకురాలు అరుణజ్యోతికి విరాళాన్ని అందజేశారు.

బాలుడికి తీవ్ర గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చైతన్య స్కూల్ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శాంతినగర్‌కు చెందిన గగనేశ్వర్‌రెడ్డి సోమవారం సంజయ్‌నగర్‌లో ఉన్న అమ్మమ్మ లక్ష్మీదేవి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా దారి మధ్యలో చైతన్య స్కూల్ వద్దకు రాగానే పట్టణంలో నుంచి కదిరిగేటు వైపు గుర్తు తెలియని ద్విచక్ర వాహనంలో ఓ వ్యక్తి బాలుడిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గగనేశ్వర్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేళ్లమద్దిలో తీరిన తాగునీటి సమస్య

నల్లమాడ: వేళ్లమద్ది పంచాయతీలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలో 250 కుటుంబాలు ఉండగా.. ఒకే బోరు ఉండేది. తాగునీటికి ప్రజలు ఇబ్బందులు అవస్థలు పడుతుండటంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఇటీవల సమస్యను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి జల జీవన మిషన్ (జేజేఎం) కింద నూతనంగా బోరుబావి తవ్వేందుకు అనుమతులు మంజూరు చేయించారు. ఆదివారం రాత్రి బోరు వేయించగా.. మూడు ఇంచుల నీరు పడినట్లు సర్పంచ్ బొజ్జేనాయక్, వైఎస్సార్‌సీపీ పంచాయతీ కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

బత్తలపల్లి: మండలంలో వివిధ స్థానాల్లో బదిలీ అయిన అధికారుల స్థానంలో కొత్తగా వచ్చిన అధికారులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి పదోన్నతిపై తాడిమర్రి ఎంపీడీఓగా వెళ్లారు. ఈమె స్థానంలో నల్లచెరువు నుంచి బదిలీపై వచ్చిన ఈఓఆర్డీ దివాకర్ బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా బత్తలపల్లి పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి సెలవులో వెళ్లి పోయారు. ఆమె స్థానంలో రాప్తాడు నుంచి కార్యదర్శి ఈశ్వరయ్య బాధ్యతలు స్వీకరించారు.

పొలాలకు దారి చూపాలని వినతి

నల్లమాడ: పొలాలకు దారి చూపించాలని కోరుతూ నల్లమాడ ఎస్సీ కాలనీ వాసులు సోమవారం స్పందనలో తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం అందించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని పలు వీధుల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పెడబల్లి బజార్, బక్కిరెడ్డి బజార్, నీళ్లట్యాంక్ బజార్‌లలో విద్యుత్ సరఫరా నిలిచి పోయిందని విద్యుత్ శాఖ ఏఈ సాలేహబాషా తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కల్లా ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా సోమవారం వివిధ హోమాలను వేదపండితులు మంజునాథశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం పూజారి నరసింహులుతో పాటు పండితులు ప్రాతఃకాలపూజ, దుర్గాహోమం, రుద్రహోమం, ఆదివాస హోమాలు చేపట్టారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

ఓడీ చెరువు: మండలంలోని లింగాలవారిపల్లికి చెందిన మద్దుల నరసింహమూర్తి (40) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచు అబీదాబాను, గ్రామ కార్యదర్శి మహమ్మద్ రఫీ, వెల్ఫేర్ అసిస్టెంట్ నిరంజన్ కుమార్ వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును మృతుడి భార్య చంద్రకళకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచు నాగభూషణ, వార్డు మెంబర్ రమేష్, స్థానిక నాయకులు భారతి సిమెంట్ రఫిక్, మెడికల్ శ్రీనివాసరెడ్డి, మనోహర్ రెడ్డి, ఓబుళరెడ్డి, నరసింహారెడ్డి, రామశంకర్ పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పరిశీలన

కనగానపల్లి: వేసవి సెలవులు తర్వాత పాఠశాలలు పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేస్తామని సీఎంఓ హెచ్.ఓబుళపతి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో భద్రపరిచిన విద్యా కానుక కిట్లను సీఎంఓ పరిశీలించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా గంగావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ఈఓఆర్‌డీ అశోక్ నాయక్, కార్యాలయ సిబ్బంది ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు.

కనగానపల్లి: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామని ఎంపీడీఓ టీ అలివేలమ్మ తెలిపారు. సోమవారం నూతన ఎంపీడీఓగా అలివేలమ్మ బాధ్యతలు స్వీకరించారు.